జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 57 9-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# హిస్టరీ రిపీట్..

## మూడోసారి టీ20 విశ్వవిజేతగా భారత్..

- నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ చారిత్రాత్మక విజయం
- 255 పరుగుల భారీ స్కోర్‌తో కివీస్‌పై ఒత్తిడి
- 96 పరుగుల తేడాతో కివీస్‌పై భారత్ ఘనవిజయం
- 19 ఓవర్లకు కివీస్ ఆలౌట్.



సామ్సన్ కొట్టిన సిక్స్‌లను కరిగే క్షణాలు కూడా కాసేపాగి వీక్షించినట్లు.. అభిషేక్ బాదిన బౌండరీల్ని పదిలంగా దాచుకోవాలని మైదానం ఇషాన్ ధనాధన్ అర్ధశతకానికి బంతి పెద్ద ఫ్యాన్ అయినట్లు...


అహ్మదాబాద్‌లో పరుచుకున్న 'పరుగుల' వెన్నెల యావత్ భారతాన్ని మురిపించింది. ఎందుకంటే ఈ ప్రపంచకప్ విజయం...దీని తాలూకు వచ్చే ఆనందం... ఓ పూటకే సరిపోదు.ఒక్క చోటికే పరిమితం కాదు. మొత్తం దేశాన్నే తమ క్రికెట్ అభిమాన ప్రవాహంలో ఉప్పొంగేలా చేసింది.ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది.

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగానిలిచింది. డిఫెండింగ్ చాంపియన్‌గాకరీబియన్‌లో పట్టుకొచ్చిన టీ20 ప్రపంచకప్‌ను సొంతగడ్డపైనా నిలబెట్టుకుంది. సెమీస్‌లోఇంగ్లండ్‌పై, ఇప్పుడు ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత బ్యాటింగ్ దళం గర్జించింది.

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...

# నేనే అంబాసిడర్‌గా ఉంటా

- అమరావతిలో కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

- మిగతా 2వ పేజీలో

# అతివలకే అందలం

- కలెక్టర్లు, ఎస్పీలుగా అవకాశం ఉన్న చోట మహిళలను నియమిస్తున్నాం
- మూసీ ప్రక్షాళనకు కొందరు అడ్డుపడుతున్నారు
- బఫర్‌జోన్‌లో కట్టడాలకు ప్రత్యామ్నాయం చూపుతుంటే గగ్గోలు పెడుతున్నారు
- ఈ నెల 13న మూసీ రివర్‌ఫ్రంట్‌పైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం
- గాంధీ విజ్ఞాన కేంద్రానికి రూ. 200 కోట్లు ఖర్చు చేస్తే తప్పేంటి?



హైదరాబాద్: మహిళ మాటకు విశ్వసనీయత ఎక్కువగా ఉంటుందని.. అందుకే ప్రభుత్వ పాలనలో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వివిధ శాఖల్లో మహిళలకు కీలక బాధ్యతలు అప్పగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమైన శాఖలకు మహిళలనే ఉన్నతాధికారులుగా నియమించామని అన్నారు. పలు జిల్లాలకు కలెక్టర్లుగా, అవకాశమున్న చోట ఎస్పీలుగా నియమించామని తెలిపారు. ఆదివారం ప్రజా భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళ కేంద్రంగా పథకాలు..: 'ఉక్కు మహిళ సోనియాగాంధీ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. అందుకే మహిళ కేంద్రంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నాం. మహిళా సంఘాలు కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా వెయ్యి బస్సులకు యజమానులను చేశాం. వెయ్యి

- మిగతా 2వ పేజీలో



## మౌలిక వ్యవస్థలపై భారీ దాడులు

- తొమ్మిదో రోజుకు పశ్చిమాసియా యుద్ధం
- ఇరాన్ చమురు నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి
- చమురు లీకేజీతో మంటల్లో చిక్కిన టెహ్రాన్ వీధులు
- ఇరాన్ అంతరిక్ష సంస్థ ప్రధాన కార్యాలయం ధ్వంసం
- బహ్రెయిన్ నీటి శుద్ధి కేంద్రంపై విరుచుకుపడిన ఇరాన్
- కువైట్ సిటీపై డ్రోన్ల వర్షం కురిపించిన ఇరాన్ సైన్యం
- సౌదీ అరేబియాలో ఒక భారతీయుడి దుర్మరణం

2లో

## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే

- మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్
- ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి
- పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం
- ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే

2లో

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది: పవన్ కల్యాణ్

- డార్జిలింగ్ సంతాల్ సదస్సు నిర్వహణ తీరుపై పవన్ కల్యాణ్ స్పందన
- రాష్ట్రపతి ఆవేదన భరిత వ్యాఖ్యలు తనను బాధించాయన్న డిప్యూటీ సీఎం
- సొంత సదస్సుకే సంతాల్ ప్రజలు రాలేకపోవడం దురదృష్టకరం



2లో



## 30 నెలల్లో 'పాలమూరు' పూర్తి

- మార్చి 2027 నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ అందుబాటులోకి..
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో మంత్రి ఉత్తమ్

## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనిడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. "అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగీ నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది" అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి', 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు. సమాజంలో తరచూ వినిపించే "ఆడపిల్లలా ఏడవొద్దు", "గాజులు తొడుక్కోలేదు", "చీర గాజులు పంపిస్తా" వంటి మాటలు ఎవరు మాట్లాడినా తప్పేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మహిళలను కించపరిచే భాష, సన్నివేశాలు ఉండకూడదని తాను పోరాడుతున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామూర్తుల సహనానికి, శక్తికి లోకేశ్ పాదాభివందనం చేశారు.

## 30 నెలల్లో 'పాలమూరు' పూర్తి

హైదరాబాద్: పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వచ్చే 30 నెలల్లో పూర్తి చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. మార్చి 2027 నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో సహా దక్షిణ తెలంగాణ ప్రాంతానికి సాగునీరు అందించే ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, వనరులను కల్పించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కల్వకుర్తికి రూ.909 కోట్లు, నెట్టెంపాడుకు రూ.252 కోట్లు, బీమాకు రూ.200 కోట్లు, కోయిల్‌సాగర్‌కు రూ.185 కోట్లు కలిపి మొత్తం రూ.1546 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగిరం చేయడంలో భాగంగా భూసేకరణ కోసం రూ.5వేల కోట్లను కేటాయిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ఆదివారం ఆయన జలసౌధలో సమీక్షించారు. గత బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.35,200 కోట్ల అంచనాలతో పరిపాలనపర అనుమతులు జారీ చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.27,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేసినట్టు చెప్పుకుంటోందని తప్పుబట్టారు. అంత ఖర్చుచేసినా ఎకరానికి సాగునీరు అందించలేదన్నారు. తాజాగా అంచనాలు రూ.55 వేల కోట్లకు పెరిగాయని, డిస్ట్రిబ్యూటరీల వ్యయం కలిపితే రూ.80వేల కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై రూ.7,161 కోట్లను ఖర్చు చేసిందన్నారు. జూరాల ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలు కాగా, పూడికతో 9 టీఎంసీలకు తగ్గిపోయిందని ఉత్తమ్ తెలిపారు. నిల్వ సామర్థ్య పునరుద్ధరణకు తక్షణమే పూడిక తొలగింపు పనులను చేపడతామని ప్రకటించారు. జూరాల నుంచి తొలగించే ఇసుకను గోదావరి పరీవాహకంలోని ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన కృష్ణాజలాల్లో చుక్క నీళ్లను వదులుకోమన్నారు. సమీక్షలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది: పవన్ కళ్యాణ్

రాష్ట్రపతి పర్యటనను హుందాగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం విఫలం పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సంతాల్ సదస్సు' నిర్వహణ తీరు, అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రోటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదన్నారు. భారతదేశ అస్తిత్వంలో, మన దేశ ఖ్యాతిలో గిరిజన సమాజాలు అంతర్భాగమని పవన్ కళ్యాణ్ కొనియాడారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి గళానికి ఎల్లప్పుడూ నిజాయతీతో కూడిన గౌరవం లభించాలన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా, రాజ్యాంగ అధిపతికి అసౌకర్యం కలిగించేలా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరమని పవన్ కళ్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా పాలకులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# హిస్టరీ రిపీట్..



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం సాక్షిగా భారత క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయం ఆవిష్కృతమైంది. 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించిన టీమ్ ఇండియా, మూడోసారి ప్రపంచ విజేతగా నిలిచి రికార్డు సృష్టించింది. గత 2024 టీ20 ప్రపంచకప్ గెలుపు జ్ఞాపకాలను గుర్తుచేస్తూ.. వేలమంది అభిమానుల 'వందేమాతరం' నినాదాల మధ్య భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు (బ్యాక్-టు-బ్యాక్) టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా, అలాగే మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఏకైక జట్టుగా భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును సాధించింది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు కివీస్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడి సిక్సర్ల వర్షం కురిపించారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు ఆది నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా లోకల్ హీరో అక్షర్ పటేల్ పవర్‌ప్లేలోనే ఫిన్ అలెన్ వంటి ప్రమాదకర బ్యాటర్‌ను అవుట్ చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. ఆ తర్వాత జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్ మాయాజాలంతో కివీస్ ఆశలపై నీళ్లు చల్లాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టిన బుమ్రా, ఒక దశలో హ్యాట్రిక్ తీసేంత పని చేశాడు. మిచెల్ సాంట్నర్, జేమ్స్ నీషమ్ వంటి సీనియర్లను తన అద్భుతమైన స్లోయర్ డెలివరీలతో బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. న్యూజిలాండ్ జట్టులో టిమ్ సీఫెర్ట్ ఒక్కడే 52 పరుగులతో పోరాడినప్పటికీ, వరుణ్ చక్రవర్తి అతడిని అవుట్ చేయడంతో కివీస్ పతనం పూర్తయింది. చివరలో అభిషేక్ శర్మ బౌలింగ్‌లో జాకబ్ డఫ్ఫీ వికెట్ తీయడంతో న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. ఫీల్డింగ్‌లో కూడా భారత్ అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు పట్టిన క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాన్ని శాసించాయి. ఈ విజయంతో భారత్ కేవలం టైటిల్‌ను గెలవడమే కాకుండా, టీ20 ఫార్మాట్‌లో తామే అసలైన 'బాస్' అని నిరూపించుకుంది. మ్యాచ్ ముగియగానే స్టేడియం మొత్తం బాణాసంచా వెలుగులతో, అభిమానుల కేరింతలతో హోరెత్తిపోయింది.

## మౌలిక వ్యవస్థలపై భారీ దాడులు

టెహ్రాన్/దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం నానాటికీ తీవ్రమవుతోంది. ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ పోరాటం ఆదివారం తొమ్మిదో రోజుకు చేరింది. ఇరాక్ రాజధాని టెహ్రాన్‌తో పాటు అల్‌బోర్జ్‌లోని చమురు లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడికి దిగింది. నాలుగు చమురు నిల్వ కేంద్రాలతో పాటు ఉత్పత్తి, బదిలీ కేంద్రంపైనా వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో నలుగురు ట్యాంకర్ డ్రైవర్లు మరణించారు. టెహ్రాన్ వీధుల్లో చమురు ఏరులై ప్రవహించింది. చమురుకు మంటలంటుకొని అగ్నిధారలను తలపించాయి. యాజ్ద్, టెహ్రాన్, ఇస్ఫహాన్ నగరాలపైనా ఇజ్రాయెల్ విరుచుకుపడింది.

భారీగా క్షిపణులు ప్రయోగించింది. ఇస్ఫహాన్‌లో వర్క్‌షాపులను, హార్స్‌రైడింగ్ క్లబ్‌ను బాంబులు ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. ఇస్ఫహాన్ ఎయిర్‌పోర్టులో ఇరాన్‌కు చెందిన ఎఫ్14 విమానాలు, గగనతల రక్షణ వ్యవస్థను తుత్తునియలు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. టెహ్రాన్‌లో ఇరాన్ అంతరిక్ష సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశామని పేర్కొంది. ఈ కార్యాలయాన్ని ఉగ్ర కార్యకలాపాలతో పాటు ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) వాడుకుంటోందని ఆరోపించింది. ఐఆర్‌జీసీ ఇంటర్నల్ సెక్యూరిటీ కమాండ్ సెంటర్, 50 ఆయుధ బంకర్లు, గ్రౌండ్ ఫోర్స్ కాంపౌండ్‌ను నామరూపాల్లేకుండా చేసినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడుల్లో ఒక భారతీయుడు, మరొక బంగ్లావాసి మరణించినట్టు సౌదీ అరేబియా ప్రకటించింది. 12 మంది బంగ్లాదేశీలు గాయపడ్డట్టు వెల్లడించింది. కువైట్‌పై ఇరాన్ భారీ దాడులకు పాల్పడింది. అల్‌అదిరీ ఎయిర్‌బేస్‌పై మిస్సైల్, డ్రోన్‌ను ప్రయోగించింది. అమెరికా హెలికాప్టర్ మరమ్మతు కేంద్రాన్ని, ఇంధన ట్యాంకులను, కమాండ్ పోస్టు ధ్వంసం చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. యూఎస్ థాడ్ క్షిపణిరక్షణ వ్యవస్థకు సంబంధించిన నాలుగు రాడార్లను గత 24 గంటల్లో నేలమట్టం చేశామని వెల్లడించింది. ప్రెసిషన్‌గైడెడ్ మిస్సైళ్లతో ఈ దాడికి దిగినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ పేర్కొంది. బహ్రెయిన్‌లోని నీటి శుద్ధి కేంద్రంపైనా ఇరాన్ సైన్యం దాడికి దిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగిన దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. ఈ యుద్ధంలో పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి. తొలుత అమెరికాఇజ్రాయెల్ సైన్యమే తమ డిశాలినేషన్ ప్లాంట్‌పై వైమానిక దాడులకు పాల్పడిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆరోపించారు. ఎడారి ప్రాంతమైన గల్ఫ్‌లో తాగునీటికి డిశాలినేషన్ ప్లాంట్లే ప్రాణాధారం. యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలోనివసిస్తున్న అమెరికన్లు స్వదేశానికి పయనమవుతున్నారు. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటికే 32,000 మందికిపైగా పౌరులు అమెరికాకు చేరుకున్నారు.

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్... నేనే అంబాసిడర్‌గా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు. "మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు. ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు.

# అతివలకే అందలం

మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లకు సైతం యజమానులుగా నిలబెట్టాం. ఎస్‌హెచ్‌జీలు ఉత్పత్తి చేసే వస్తువుల విక్రయం కోసం అమెజాన్‌తో అవగాహన కుదుర్చుకున్నాం. లోకల్ టాలెంట్‌ను గ్లోబల్ టాలెంట్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 'దేశంలో ఇంకా మహిళలు, పురుషులు, కులాలు అంటూ ఎన్నో రకాలుగా వివక్ష కనిపిస్తూనే ఉంది. అభివృద్ధి చెందిన అమెరికాలోనూ వివక్ష ఉన్నప్పటికీ అక్కడ కష్టపడే వారికి గుర్తింపు ఉంది. మన దేశంలోనూ కష్టపడే వారికి గుర్తింపు ఇవ్వాలి.. అవకాశాలు కల్పించాలి. నా ప్రయాణంలో అనేక మంది జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులు నా శ్రేయోభిలాషులుగా ఉన్నారు'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా మూసీని ప్రక్షాళన చేయాలనుకుంటున్నాం. కానీ కొందరు ఈ ప్రభుత్వాన్ని ఏమీ చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగా రివర్ ఫ్రంట్ నిర్మించిన వారు హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌ను మాత్రం వద్దంటున్నారు. ఈసా నది ఒడ్డున 2004లో 9 మీటర్ల బఫర్ జోన్‌లో అపార్ట్‌మెంట్ కట్టారు. నదులకు 50 మీటర్ల బఫర్ జోన్ ఏర్పాటు చేస్తూ తర్వాత నిర్ణయం తీసుకున్నారు. 50 మీటర్ల లోపల కట్టడాలపై నిషేదం ఉంది. 50 శాతం బఫర్ జోన్ ఉంది. అందుకే ఆ అపార్ట్‌మెంట్ నివాసితులను పిలిచి మాట్లాడాం. వాళ్లకు ఏడెకరాల భూమి ఇచ్చి అందులో అపార్ట్‌మెంట్ కట్టుకోవడానికి కావాల్సిన డబ్బు డిపాజిట్ చేస్తామని చెప్పాం. కానీ రాజకీయ జోక్యం పెరిగింది. ప్రతి పార్టీ అక్కడికి వెళ్లి సానుభూతి చూపిస్తోంది. సానుభూతితో సమస్య పరిష్కారం కాదు. 50 మీటర్ల బఫర్‌జోన్‌లో ఉన్న అన్ని కట్టడాలకు విలువ సున్నాయే. ప్రత్యామ్నాయం చూపించాలని మేం ప్రయత్నిస్తుంటే రాజకీయ పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. బఫర్ జోన్‌లో ఉన్న వారికి జరిగే నష్టంపై చర్చిస్తే బాగుంటుంది. నగరాన్ని కాపాడుకోవడానికి, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక కావడానికి అందరి సహకారం కావాలి. గాంధీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు రూ. 200 కోట్లు ఖర్చు చేస్తే తప్పేంటి? ఈ నెల 13న మూసీ రివర్ ఫ్రంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నాం'అని సీఎం వివరించారు.

### త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై శుభవార్త

'జర్నలిస్టుల మధ్య ఎలాంటి తేడా లేదు. డెస్కు జర్నలిస్టులు, బ్యూరో జర్నలిస్టులు అని వేరుగా చూడం. అందరూ సమానమే. ప్రైవేటు కార్యాలయాల్లో మహిళల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇటీవలే ఈ అంశంపై చర్చ చేశాం. త్వరలో నిర్ణయం తీసుకుంటాం. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలపై ఫిర్యాదులకు ఒక వేదిక ఏర్పాటు చేస్తాం. నిజమైన జర్నలిస్టులెవరో, జర్నలిస్టు ముసుగులో వ్యాపారాలు చేస్తున్నవారెవరో తేడా తెలియాలి. అందుకోసం ప్రత్యేకంగా చట్టంపై అసెంబ్లీలో చర్చిస్తాం. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశం సుదీర్ఘకాలంగా ఉంది. చట్టం వల్ల ఇబ్బంది లేకుండా ఇళ్ల స్థలాలపై నిర్ణయం తీసుకుంటాం. అతిత్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి మంచి వార్త చెబుతా.

## భారతీయులు గర్వపడే విజయమిది : వైఎస్ జగన్

అమరావతి: టి20 వరల్డ్ కప్ గెలిచిన భారత క్రికెట్ బృందానికి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. అద్భుతంగా ఆడి మళ్లీ చాంపియన్లుగా నిలిచిన కెప్టెన్ సూర్యకుమార్ నేతృత్వంలోని జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. తుదిపోరులో ప్రారంభం నుంచే భారత్ ఆధిపత్యం ప్రదర్శించిందని కొనియాడారు. అభిషేక్ శర్మ, సంజు సామ్సన్, ఇషాన్ కిషన్ బాగా ఆడారని, చివరి విజయ క్షణాలు భారతీయులందరినీ గర్వపడేలా చేశాయని అభివర్ణించారు. వరల్డ్ కప్ కిరీటం తిరిగి మన ఇంటిలోనే ఉందంటూ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఫైనల్లో టీమిండియా ప్రదర్శించిన అద్భుత ఆటతీరు దేశ ప్రజలందరికీ గర్వకారణమని కొనియాడారు. ఈ విజయం దేశ క్రీడా రంగానికి మరింత గౌరవం తెచ్చిందని రేవంత్ అన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## ప్రేమ పేరుతో వంచన.. యువతి ఆత్మహత్య



**వలిగొండ, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వలిగొండ మండలం ఎం.తుర్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముంతస్వామి కుమార్తె మమత (25), బీకాం పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. కాగా ఆమె తల్లిదండ్రులు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్ ప్రకారం మొగిలిపాక గ్రామానికి చెందిన మర్ల మత్స్యగిరి అనే యువకుడు మమతను ప్రేమించి మోసం చేశాడని, ప్రస్తుతం మరో యువతితో వివాహానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు మర్ల మత్స్యగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్: ఎమ్మెల్యే కుంభం అనిల్



**వలిగొండ, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రావుఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదని, అది స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీక అని అన్నారు. రంజాన్ మాసం శాంతి, సామరస్యాన్ని ప్రతిబింబించే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సఖ్యతతో జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్ష విరమణలో పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రావుఫ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను బలపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, బత్తిని లింగయ్య, గరిసె రవి, బత్తిని సహదేవ్, పల్సం సతీష్ గౌడ్, బోళ్ల శ్రీనివాస్, కుందారపు కొమురయ్య, కాసుల వెంకన్న గౌడ్, పాలకుర్ల వెంకటేశం, వంగాల అశోక్ గౌడ్, కొండూరు భాస్కర్, ఐటిపాముల రవీంద్ర, గంగాపురం సతీష్, కొండూరు సాయి, బత్తిని నాగేష్ గౌడ్, మైసొల్ల ప్రవీణ్, కందుల నరేష్ తదితరులతో పాటు ముస్లిం సోదరులు ఎండి అఖిల్ పాషా, ఎండి ఆదిల్ పాషా, ఎండి ఖుర్చీద్, మహమ్మద్ సయ్యద్ పాషా, గులాం సైదాని, ఎస్ దాని, గులాం జిలాని, అబ్దుల్ సమద్, ఎస్.కె రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన డోజర్ వాహనం స్వాధీనం: నిందితుడి అరెస్టు

**రాజపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలో చోరీకి గురైన డోజర్ వాహనాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వై. లింగారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన రఘుపతి రాజుకు సంబంధించిన టీఎస్ 03 యుబి 4047 నంబర్ గల డోజర్ వాహనాన్ని గత నెల ఫిబ్రవరి 8న రాజపేట పెట్రోల్ బంక్ వద్ద పార్క్ చేసి వెళ్లారు. అదే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఎస్ఐ వై. లింగారెడ్డి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కే. యాదయ్య, పోలీసు సిబ్బంది ఏ. మారుతి, పి. శ్రీనివాస్, ఎన్. నరేందర్‌లతో కూడిన బృందం చోరీకి గురైన డోజర్ వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కామారెడ్డి జిల్లా, మాచారెడ్డి మండలానికి చెందిన కొంచెం రాజు అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.



నిందితుడు
కొంచెం రాజు
(ఫైల్ )

## ప్రజా సమస్యల పరిష్కారంలో యంత్రాంగం విఫలం

- రామన్నపేట అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించాలి..
- సీపీఎం జిల్లా కార్యదర్శి: ఎండీ జహంగీర్





**రామన్నపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. రామన్నపేట పట్టణ కేంద్రంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి 'ఇంటింటికి సీపీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని సీపీఎం ప్రజా ఉద్యమాలకు ప్రజావిరాళం సేకరించారు. అనంతరం ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. ఒకనాటి పాత తాలూకా, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రామన్నపేట ప్రస్తుతం అనేక సమస్యలతో నిండిపోయిందన్నారు. పట్టణ అభివృద్ధికి రూ. 20 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన పార్కులు ఏర్పాటు చేయాలని, అధిక వర్షాల సమయంలో వరద నీరు ఇండ్లలోకి చేరకుండా పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్గత రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించాలని, కోతులు, కుక్కలు, పందుల బెడద నుండి ప్రజలను రక్షించే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేపట్టే ఉద్యమాలకు ప్రజలు విరాళాలు అందించి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

### గ్యాస్ ధరల పెంపుపై నిరసన

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలతో కలిసి గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యుద్ధాల కారణం చూపుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేదంటే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, గాదె నరేందర్, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, నాయకులు పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం, బాబూచారి, వేముల మల్లేశం, బండ శ్రీశైలం, మునికుంట్ల రాణి, కుందూరు వెంకటేశం, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణం.. కడు రమణీయం!

- 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణం
- వేదమంత్రాల నడుమ జరిగిన దివ్య కళ్యాణ మహోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం..
- గోవింద నామస్మరణతో మార్మోగిన ప్రాంగణం





**వలిగొండ, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** వలిగొండ మండలంలోని మాందాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ వేద పండితులు కారంపూడి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణోత్సవం కడు రమణీయంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దివ్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి సోలిపురం వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, గ్రామ సర్పంచ్ దంతూరి యాదమ్మ, మాజీ జడ్పీటీసీ కుసంగి రాములు, మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి, సోలిపురం రాంరెడ్డి, సోలిపురం ఉపేందర్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల ముఖాల్లో చిరునవ్వు: ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**యాదగిరిగుట్ట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట మండలం రామాజిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. రామాజిపేట గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోల మాధవి మల్లేష్ గౌడ్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన సొంత ఇల్లు తమ కలను నిజం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇల్లు లేని పేదలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి పూర్ణకుంభ స్వాగతం

- తెలంగాణ శాసన కౌన్సిల్ భవనాలకు యాదగిరిగుట్ట అర్చకులతో ప్రారంభోత్సవ పూజలు

**హైదరాబాద్/యాదగిరిగుట్ట, మార్చి 8 (తొలివెలుగు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నిర్మించనున్న తెలంగాణ శాసన కౌన్సిల్ భవనాలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శాసన కౌన్సిల్ భవనాలకు శంకుస్థాపన చేసి, వేద మంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం ముఖ్యమంత్రి చాంబర్ కార్యాలయం అలాగే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చాంబర్ భవనాలకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వహణాధికారి భవాని శంకర్, సహాయ కార్యనిర్వహణాధికారి మహేష్, ప్రధాన అర్చకులు బట్టర్ సురేంద్రాచార్యులు, ముఖ్య అర్చకులు కిరణ్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.సి.ఐ రమణా మూర్తి

**మార్చి 8 (తొలివెలుగు):** పురుషులతో సహా మహిళలు కూడ అన్ని రంగాల్లో సమానంగా రాణిస్తున్నారని లక్షెటిపేట సి.ఐ రమణా మూర్తి అన్నారు. జన్నారం పోలీస్ స్టేషన్లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను లక్షెటిపేట సిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శృతికి శాలువా కప్పి ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సి.ఐ రమణ మూర్తి మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం అని అన్నారు.



## పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం అందజేత

**రాజపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** పేద కుటుంబాలకు అండగా నిలవడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని కుర్రారం సర్పంచ్ బొడ్డు భాస్కర్ అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన కోటగిరి విజయలక్ష్మి – శ్రీనివాసాచారి దంపతుల కుమార్తె పవిత్ర వివాహానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, తన వంతు సహాయంగా రూ.5 వేల నగదును అందజేశారు. పేదరికం కారణంగా ఏ ఆడపిల్ల పెళ్లి ఆగకూడదనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాగుల బాలయ్య, రాపోలు మల్లారెడ్డి, పాండవుల నరేందర్, ఎర్రగుంట రమేష్, ఎర్రగుంట రాజు, శ్రీరాముల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్ల మళ్లింపు: సర్పంచ్ రత్నమాల



**రాజపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం బసంతపురం కొత్త కాలనీలో నివాసాల మీదుగా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్ మళ్లింపు పనులను ఆదివారం ప్రారంభించారు. ఇళ్లపై నుంచి హైటెన్షన్ వైర్లు వెళ్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భావించిన సర్పంచ్ మెండు రత్నమాల, అధికారుల సమన్వయంతో వైర్ల మార్పునకు పూనుకున్నారు. ఆదివారం ఆమె కొబ్బరికాయ కొట్టి ఈ పనులను ప్రారంభించారు. విద్యుత్ లైన్లను ఇళ్ల పక్క నుంచి వెళ్లేలా ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. దీంతో తమకు ప్రాణాపాయం తప్పిందని, ఏళ్లనాటి సమస్య పరిష్కారమవుతోందని కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, లైన్ మెన్ నరసింహులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గో ఆధారిత వ్యవసాయంతోనే అధిక లాభాలు..

- రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్యత అవసరం: పన్యాల వెంకటరెడ్డి
- కొత్తజాలలో కిసాన్ సంఘ్ స్థాపన దినోత్సవ వేడుకలు



**రాజపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని కొత్తజాల గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ స్థాపన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు మాచిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్‌ను 1979 మార్చి 4న మాననీయ దత్తోపంత్ తేంగ్డే ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం ఈ సంఘం దేశంలోని 34 రాష్ట్రాలలో గ్రామ స్థాయి వరకు విస్తరించి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. రైతులంతా పార్టీలకు అతీతంగా ఐక్యమత్యంతో ముందుకు రావాలని, రైతాంగ సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్న రైతు గొప్పవాడని అన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు గో ఆధారిత వ్యవసాయం చేయాలని సూచించారు. పశుపోషణ ద్వారా భూసారాన్ని పెంచడంతో పాటు పాల ఉత్పత్తులను పెంచి రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. యువత వ్యవసాయ రంగంలోకి వచ్చి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్, ప్రస్తుత ఉపసర్పంచ్ ధనరాజ్ సింగ్, భువనగిరి జిల్లా కోశాధికారి వంగేటి అంజిరెడ్డి, పడమటి నరసింహారెడ్డి, రాజాపేట మండల అధ్యక్షుడు పారుపల్లి సంజీవరెడ్డి, గ్రామ రైతులుద పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సహస్ర పారాయణ వేడుకలు

**రాజపేట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** రాజపేటలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక సహస్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి రాజాపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీ లలిత సహస్రనామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేపాక భాగ్యలక్ష్మి, బోగలత, పుష్పలత, బిర్రు భాగ్యలక్ష్మి, పెంట రజిత, బెజుగం స్వప్న, ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ జై శ్రీమన్నారాయణ భక్త బృందానికి ఆశీర్వచనం అందించారు.





# యాదాద్రిలో 'అరుణాచలం' దృశ్యం..

- స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని భారీగా గిరిప్రదక్షిణం
- ఐదు కిలోమీటర్ల మేర భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణం
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- మంచును లెక్కచేయకుండా పాల్గొన్న వృద్ధులు, చిన్నారులు
- గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో గిరిప్రదక్షిణం నిర్వహించారు. ఆలయం చుట్టూ జరిగే ఈ గిరిప్రదక్షిణం అరుణాచలాన్ని తలపిస్తోందని భక్తులు, స్థానికులు పేర్కొన్నారు. యాదాద్రి గిరిప్రదక్షిణలో స్థానికులతో పాటు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని గిరిప్రదక్షిణం చేసిన భక్తులు తమ కోరికలు నెరవేరాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం చుట్టూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర జరిగే ఈ గిరిప్రదక్షిణం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమై సుమారు 8 గంటల వరకు కొనసాగుతుందని భక్తులు తెలిపారు. మధ్య వయస్సు వారితో పాటు వృద్ధులు, చిన్నారులు కూడా ఈ గిరిప్రదక్షిణంలో పాల్గొనడం విశేషం. అలాగే స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన గిరిప్రదక్షిణలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూడా పాల్గొన్నారు. ఉదయం పూట కురుస్తున్న మంచును సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావాన్ని చాటుకున్నారు.



# వేదమంత్రాల సాక్షిగా శతఘటాభిషేకం!

- స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా విశేష అభిషేకం
- 108 వెండి కలశాలతో పాంచరాత్రాగమ శాస్త్రోక్త పూజలు
- వేదమంత్రాల నడుమ మూడు గంటలపాటు అష్టోత్తర శతఘటాభిషేకం
- స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలతో విశేష అలంకారం
- తీర్థప్రసాదం స్వీకరించిన భక్తులు, దర్శనంతో కిటకిటలాడిన ఆలయం



**యాదగిరిగుట్ట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు 108 వెండి కలశాలను ఒక పీఠంపై పాంచరాత్రాగమ శాస్త్ర సిద్ధాంతం ప్రకారం క్రమబద్ధంగా ఏర్పాటు చేశారు. ఆ కలశాలలో ఆలయ అర్చకులు, ఋత్వికులు 108 రకాల ఔషధాలు, వనమూలికలు, పండ్ల రసాలు తదితరాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి కలశంపై కొబ్బరికాయలను ఉంచి పసుపు, కుంకుమలు, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పంచసూక్తాలు, పంచోపనిషత్తులు, దశశాంతులు, చతుర్వేద పారాయణాల నడుమ సుమారు మూడు గంటలపాటు స్వయంభూ మూర్తులకు అభిషేకాలు



నిర్వహించారు. తరువాత స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు ధరింపజేసి పుష్పమాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను కూడా పంపిణీ చేశారు. అలాగే 108 కలశాలకు ముందు ఏర్పాటు చేసిన ప్రధాన కలశాన్ని



ఆలయ ప్రధాన అర్చకులు గర్భగుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ఈఓ భవానీ శంకర్, డీఈఓ దొర్భాల భాస్కర శర్మ, ఏఈఓ రఘు, ఆలయ అధికారులు సీతారామాచార్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిదారిలో.. నాట్య మయూరి!

- స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ప్రత్యేక నాట్య సేవ
- 5 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణలో నిరంతర నాట్యంతో భక్తులకు అలరింపు
- స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఘన సన్మానం

**యాదగిరిగుట్ట, మార్చి 08 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కుమారి వైష్ణో దేవి గిరి ప్రదక్షిణలో అద్భుతమైన నాట్య ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు. ఆలయం చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో ఆమె నిర్విరామంగా నాట్యం చేస్తూ భక్తులను అబ్బురపరిచారు. కుమారి వైష్ణో దేవి చేసిన నాట్య ప్రదర్శనను చూసి స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్ సంతోషం వ్యక్తం చేసి ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో భవాని శంకర్, ఏఈఓ రఘు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్లు పంపిణీ


- రెండో విడత పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానం
- ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్, చిన్న పత్రికల జర్నలిస్టులకు అవకాశం
- ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలి



**అనంతపురం, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం రెండో విడతగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు రోడ్డు ప్రమాదాల నుండి రక్షించబడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ఏపీ జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ఈ హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో పలువురు జర్నలిస్టులకు హెల్మెట్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా కొంతమంది వర్కింగ్ జర్నలిస్టులకు అందించాలనే ఉద్దేశంతో రెండో విడత పంపిణీ చేపడుతున్నట్లు వివరించారు. సత్యసాయి జిల్లాలోని హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, కదిరి, రాప్తాడు తదితర నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, కెమెరామెన్లు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు, చిన్న పత్రికల ప్రతినిధులు, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న జర్నలిస్టులకు కూడా ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న అంకుశం పత్రిక ప్రధాన కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు, మీడియా ఐడీ కార్డు జిరాక్స్ ప్రతులను సమర్పించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ఉచిత హెల్మెట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సమాజ అభివృద్ధికి మహిళలే మూల స్థంభాలు

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు
- మహిళల సాధికారతకు ప్రభుత్వ పథకాలు తోడ్పాటు
- మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుంది
- పుట్టపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి



**అనంతపురం, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కేక్ కట్ చేసి మహిళలతో కలిసి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ లేకుండా సృష్టి లేదని, స్త్రీ లేకుండా జీవం లేదని, స్త్రీ లేకుండా ప్రపంచాన్ని ఊహించుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. మహిళల గొప్పతనం, వారి శక్తి, త్యాగం సమాజానికి ఎంతో ప్రేరణనిస్తాయని అన్నారు. మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలు సమాజ అభివృద్ధికి మూల స్థంభాలుగా నిలుస్తారని తెలిపారు. కుటుంబాన్ని నిర్మించడంలోనే కాకుండా దేశ నిర్మాణంలో కూడా మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. మహిళ సాధికారత ద్వారా కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్త్రీ శక్తి పథకం ద్వారా కోట్లాది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందుతున్నారని తెలిపారు. అలాగే మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా లక్షలాది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రతి ఏడాది రూ.15 వేల ఆర్థిక సహాయం అందుతున్నట్లు తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు గతంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా మహిళలకు మరింత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. మహిళల భద్రత, ఆరోగ్యం, విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇంటికి పరిమితమైన మహిళలను చట్టసభల వరకు తీసుకెళ్లి మహిళల హక్కులు, సంక్షేమం కోసం పనిచేసే అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు
- ప్రజలు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపు



**కళ్యాణదుర్గం, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణదుర్గం గ్రామీణ ప్రాంతంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రజావేదిక సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజావేదికలో ఈ శిబిరాన్ని శాసనసభ్యుడు అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యాదగిరిలో భక్తజన సంద్రం..

# కిటకిటలాడిన క్యూలైన్లు

- ఆదివారం సెలవుదినం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- క్యూలైన్లలో గంటల తరబడి వేచి చూసిన దర్శనార్థులు
- వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసిన దేవస్థానం అధికారులు
- ఐదు గంటలు సాధారణ దర్శనం.. రెండు గంటలు శీఘ్ర దర్శనం
- భక్తులకు అన్నదానం, ప్రసాదాల కొనుగోళ్లతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



**యాదగిరిగుట్ట, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం సెలవుదినం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా పెరిగింది. గర్భాలయం, విష్ణు పుష్కరిణి, ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, శీఘ్ర దర్శనం ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. సెలవుదినం కావడంతో పాటు వివాహాలు ఎక్కువగా ఉండటంతో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చినట్లు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరుతూ స్వామి అమ్మవార్ల దర్శనం కోసం వేచి ఉన్నారు. కొండపై 60 సంవత్సరాలు దాటిన వృద్ధుల కోసం దేవస్థానం అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాధారణ దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టగా, శీఘ్ర దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వసతి గదులు లభించని భక్తులు తులసి కాటేజీ, దేవస్థానం పరిసరాలతో పాటు కొండకింద విష్ణు పుష్కరిణి సమీపంలోని డార్మెటరీ హాల్‌లో విశ్రాంతి తీసుకున్నారు. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులకు దేవస్థానం అధికారులు అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం లడ్డూ, పులిహోర ప్రసాదాలను కొనుగోలు చేశారు.





# మహిళల అభ్యున్నతే ఫౌండేషన్ లక్ష్యం





- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళల అభివృద్ధికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
- అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, స్వీట్లు పంపిణీ
- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్: ఇరుగదిండ్ల భాస్కర్

**చౌటుప్పల్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఇరుగదిండ్ల భాస్కర్ వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో మహిళల పాత్ర, వారి సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి మగాడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబం నుండి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో ముందుకు రావడానికి సహకరించడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళల సాధికారత కోసం భవిష్యత్తులో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మునుగోడు మండల కేంద్రంలో మహిళల కోసం ప్రత్యేక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించడం, ఫెన్సింగ్ వాల్స్ ఏర్పాటు చేయడంలో ఫౌండేషన్ సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల పిల్లల ఉన్నత విద్యకు అవసరమైన సహాయం అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందరికీ చేరేలా చేయడం ఫౌండేషన్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు పంచిపెట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఆలే శ్రీలత చిరంజీవి, బత్తుల జయమ్మ దాస్, బుడ్డ సురేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఫౌండేషన్ టీం సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి: కౌన్సిలర్ బత్తుల వాణి

- మున్సిపాలిటీలో ఘనంగా మహిళా దినోత్సవం



**చౌటుప్పల్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా బలపడాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ గౌడ్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం చౌటుప్పల్ లోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు కౌన్సిలర్ వాణిని ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలందరికీ ఆమె మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. మహిళలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని, వారి ముఖాల్లో నిరంతరం చిరునవ్వు ఉండాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారు సమాజంలో గౌరవంగా జీవించేలా చూడాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా మారినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళతో పాటు అధిక సంఖ్యలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# మహిళా ప్రగతితోనే సమాజ వికాసం

- శ్రీ ఉమెన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం
- ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళా సిబ్బందికి సన్మానాలు, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ
- మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి: ఎడ్ల హిమబిందు రెడ్డి





**చౌటుప్పల్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ ఉమెన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు చింతల ఉమామహేశ్వరి, ఆలే శ్రీలత, బత్తుల జయమ్మ, పల్లె లావణ్య, పోలేపల్లి లక్ష్మీ, ఊడుగు జ్యోతి తో పాటు ఆసుపత్రిలో సేవలందిస్తున్న డాక్టర్ అలివేలు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని శ్రీ ఉమెన్స్ క్లబ్ ఆర్గనైజర్ ఎడ్ల హిమబిందు రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఆసుపత్రిలో సేవలందిస్తున్న ఉత్తమ మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎడ్ల హిమబిందు రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళా అభివృద్ధి ద్వారానే కుటుంబం, సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు తమ వృత్తితో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే ఆత్మరక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళల పాత్ర లేకుండా సమాజ మనుగడ సాధ్యం కాదని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల ఉమామహేశ్వరి, ఆలే శ్రీలత, బత్తుల జయమ్మ, పల్లె లావణ్య, శ్రీలక్ష్మీ, ఊడుగు జ్యోతి, క్లబ్ సభ్యులు ఎడ్ల హిమబిందు రెడ్డి, డాక్టర్ అలివేలు, ఎస్. దీపిక, బి. అరుణ, డి. నాగలక్ష్మీ, ఆసుపత్రి మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా జానకి రెడ్డి నియామకం

- నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్
- ఉద్యమకారుల హక్కుల సాధనకు కృషి చేస్తానని జానకి రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కే. జానకి రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ఆదివారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జానకి రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్‌తో పాటు ఫోరం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిరంతరం పని చేస్తూ సంస్థ బలోపేతానికి కట్టుబడి ఉంటానని జానకి రెడ్డి పేర్కొన్నారు.

## గ్యాస్ ధరలతో సామాన్యుడిపై గుదిబండ!

- మంట పుట్టిస్తున్న గ్యాస్ ధరలు.. చౌటుప్పల్‌లో సీపీఎం ధర్నా



**చౌటుప్పల్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్) :** వంట గ్యాస్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న తరుణంలో గ్యాస్ ధరలు పెంచడం సరికాదన్నారు. తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి పాషా, నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఎండి ఖయ్యూం, కందగట్ల ఆనంద్, తూర్పునూరి మల్లేశం, బోయ యాదయ్య, కల్వకుంట్ల శివ, దాసరి ప్రకాష్, బావండ్లపల్లి స్వామి, బత్తుల నవీన్, యాదయ్య, రాజు, ఎండి హర్ష బేగం తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి

**మార్చి 8, సిర్పూర్ (టి) మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)నియోజకవర్గంలోని సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణం లోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షు రాలు వైద్య శాంతి కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సునీత, ఏ ఎస్ ఐ తిరుమల, డాక్టర్లు అర్షిన్,అశ్విని,వివిధ సంఘాల నాయకులు త్రివేణి, ఫయాజ్ ఉన్నిసా,వినోద,అనిత,అరుణా పవని,సమత కుమారి,సబితా, సుధా,వాసవి,ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు.అనంతరం వీరు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షు రాలు వైద్య శాంతి కుమారి తో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అట్టి సంద ర్భంలో వీరు మాట్లాడుతూ సమాజంలో మహిళల గౌరవాన్ని పెంపొందించడం,మత సామర స్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఇఫ్తార్ విందు నిర్వహిం చడంజరిగిందనిఅన్నారు.సమాజ పురోగతికి మహిళల సాధికారత, మత సామరస్యం ఎంతో అవస రమని, మహిళలు అన్ని రంగాల లో ముందుకు రావడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇఫ్తార్ విందు వంటి కార్యక్రమా లు సమాజంలో ఐక్యత పరస్పర గౌరవం, సహనం అదేవిధంగా మత సామరస్యాన్ని పెంపొందిం చడంలో ముఖ్య పాత్ర పోషిస్తా యని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంచి సమాజంలో శాంతి, సహకార భావాలను బలో పేతం చేస్తాయని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల కృషిని గుర్తించి వారికి గౌరవం తెలిపే ముఖ్యమైన రోజు అని అన్నారు. కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.మహిళల అభివృద్ధిదేశ అభివృద్ధికి బలమైన పునాది అని,మహిళలకు సమాన అవ కాశాలు కల్పించడం సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.విద్య,ఉపాధి, నాయకత్వ రంగాలలో మహిళ లకు ప్రోత్సాహం అందించినప్పు డే సమాజం సమతుల అభివృ ద్ధిని సాధిస్తుందని అన్నారు. మహిళలు సమాజ అభివృద్ధికి ఆధారస్తంభాలని తెలిపారు. విద్య,ఆరోగ్యం, సామాజిక రంగాలలో మహిళలు మరింత ముందుకు రావడానికి అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళల సాధికారతతోనే సమాజం సమగ్ర అభివృద్ధిని సాధించగలదని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులై స్వయం ప్రతిభతో ఎదిగినప్పుడు కుటుంబం,సమాజం,దేశం అభివృద్ధి దిశగా పయనిస్తాయని తెలిపారు.అంతర్జాతీయమహిళా దినోత్సవ కార్యక్రమం అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ పట్టణంలోని అన్ని వర్గాల మహిళలు పాల్గొన్నారు.




## పటేల్ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో పాలీసెట్ మోడల్ గ్రాండ్ టెస్ట్ 2026 విజయవంతం

**మంచిర్యాల,మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** మంచిర్యాల జిల్లాలో పదవ తరగతి విద్యార్థుల ప్రతిభను పరీక్షించేందుకు పటేల్ విద్యార్థి యువజన సంఘం (పీవీవైఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో సృష్టి ఇన్స్టిట్యూట్ మద్దతుతో ఆదివారం నిర్వహించిన పాలీసెట్2026 మోడల్ గ్రాండ్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించి నట్లు పీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ తెలిపారు. ఈ పరీక్షకు సుమారు 200 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారన్నారు. రాబోయే పాలీసెట్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. పరీక్షను క్రమబద్ధంగా నిర్వహించడంలో నిర్వాహక కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాబోయే పాలీసెట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీవీవైఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ పటేల్, తిరుపతి పటేల్, ఆశిష్ కుమార్, విఘ్నేష్, ఉదయ్ పటేల్తో పాటు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం



**మంచిర్యాల, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి అంబేద్కర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి మెడికల్ క్యాంపులు మరింతగా నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ క్యాంపులో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దీనిలో భాగంగా మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా కొన్ని వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## బాలికల ఆరోగ్య రక్షణకు 'హెచ్‌పీవీ' టీకా







- చౌటుప్పల్ సీహెచ్‌సీలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం
- 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా ప్రారంభం
- మహిళల ఆరోగ్య రక్షణకు కీలకమని వైద్యుల సూచన

**చౌటుప్పల్, మార్చి 8 (తొలివెలుగు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటం రాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద, 20వ వార్డ్ కౌన్సిలర్ హన్ను చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణలో ఈ టీకా ఎంతో ముఖ్యమని వైద్యులు వివరించారు. బాలికల ఆరోగ్య రక్షణకు ఈ టీకా కీలకమని, తల్లిదండ్రులు తమ కుమార్తెలకు ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలను రక్షించేందుకు ఈ కార్యక్రమం ముఖ్యమైనదని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం సమాజంలో అవగాహన పెంచి బాలికల ఆరోగ్య భద్రతకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొగుదాల రమేష్ గౌడ్, గైనకాలజిస్ట్ డా. విజయలక్ష్మి, పీడియాట్రిక్ డా. అజీమా, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. "ఆరోగ్యమైన బాలికలు శక్తివంతమైన మహిళలు అభివృద్ధి చెందిన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటం రాజు తెలిపారు.